క్లుప్తంగా

కౌలు రైతులందరు గుర్తింపు కార్డులు పొందాలి



కేబీపాలెం(కాకుమాను): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా సాగుభూమిని కౌలుకు తీసుకున్న కౌలు రైతులందరూ తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలని ఏవో వి.సుధాకర్ అన్నారు. మండలంలోని కేబీపాలెం,కొల్లిమర్ల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు వెద పద్ధతిలో సాగుచేస్తున్నారని సాగు చేస్తున్న రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు అర్హులని ఆయన తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి బ్యాంక్‌లో ఎన్.పీ.సీ.ఐ లింకు లేని వాళ్లు వెంటనే లింక్ చేయించుకోలన్నారు. కార్యక్రమంలో పీఏఏ కరుణాకర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానులే



పెద్దివారిపాలెం(కాకుమాను): సమాజంలో అందరు సమానులేనని ఎవ్వరినీ అంటరాని వారిగా చూడరాదని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జస్టిస్ కె.పున్నయ్య కమిటీ నివేదిక ప్రకారం డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ప్రతినెలా 30న పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమాజంలో ఎవరినైనా అంటరాని వారిగా చూస్తే చట్టరీత్యా శిక్షార్హులని ఆయన తెలిపారు. గ్రామాలలోని టీ దుకాణాలు, హోటల్స్‌లో రెండు గ్లాసుల పద్ధతిని అమలు చేస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ ఉంటుందని నిబంధనలక ఎవరైన విరుద్ధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.యుగకీర్తి, ట్రైనీ ఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీకి పీహెచ్‌డీ ప్రదానం



పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. ఏఎన్‌యూ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆచార్యులు వి.దివ్యతేజోమూర్తి పర్యవేక్షణలో గిరిజాశంకర్ రోల్ ఆఫ్ నాచురల్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ ఆన్ రూరల్ లైవ్లీహుడ్ (ఏ స్టడీ ఆఫ్ వైయస్సార్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజాశంకర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. ఏఎన్‌యూ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్న గిరిజాశంకర్‌ను పలువురు అభినందించారు.

రేపటి నుంచి ఆటో మ్యూటేషన్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు చేయనుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆస్తులకు ఆటో మ్యూటేషన్ని రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ విధానాన్ని ఇప్పటికే విజయవాడలో అమలుచేయగా అక్కడ సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలోనూ ఆగస్టు ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆస్తులకు ఆటోమ్యుటేషన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి కావటంతో పాటుగా సమయం కూడా ఆదా అవుతుందన్నారు.

వ్యక్తిపై దాడి

పట్నంబజారు: వ్యక్తిపై దాడి చేసిన గాయపరిచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. షాపు ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉండే మద్దినేని నాగేశ్వరరావు, నందివెలుగురోడ్డులోని వస్త్రలత కాలనీలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వజ్రాల కోటిరెడ్డి గతంలో రూ.60 వేలు గుడి అభివృద్ధి నిమిత్తం ఇచ్చారు. తాను ఇచ్చిన డబ్బులకు సంబంధించి ఏం అభివృద్ధి చేశారనే అంశంపై మంగళవారం ఇరువురూ మధ్య ఆలయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీనితో కోటిరెడ్డి, అతడి బంధువులు నాగేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు నిమిత్తం పర్మిషన్‌కు కోర్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

భరోసా దక్కేనా?

పాపం కౌలు రైతులు

- భూమి పత్రాలిచ్చేందుకు యజమానులు ససేమిరా
- నత్తనడకన సాగుతున్న సీసీఆర్సీ కార్డుల పంపిణీ
- పొన్నూరు మండలంలో 4,500 కార్డులు లక్ష్యం
- ఇప్పటికీ కౌలు రైతులకు అందిన కార్డులు 2,943



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పొన్నూరు: కౌలు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అన్నదాతకు ప్రభుత్వం నుంచి సహకారం అందక.. పంట సాగులో లాభాలులేక కౌలు రైతులు సతమతమవుతున్నారు. మండలంలోని సుమారు 28 వేల ఎకరాలు వ్యవసాయ భూమి ఉండగా, వానిలో ప్రధానంగా వరి సాగు చేస్తారు. వారిలో కౌలు రైతులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కౌలు వారికి నష్టాలు సంభవించినపుడు పరిహారం అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో రైతులు, కౌలు రైతులకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. అయితే కౌలు రైతు గుర్తింపు కార్డు రావాలంటే సంబంధిత భూ యజమాని అంగీకార పత్రం తప్పనిసరి. కానీ భూ యజమానులు పలు అపోహలతో అంగీకారం తెలపడం లేదని సమాచారం. ఫలితంగా సీసీఆర్ కార్డుల పంపిణీ అంతంత మాత్రంగానే జరుగుతోంది. నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోలేకపోతున్నారు.

క్షేత్రస్థాయిలో అడ్డంకులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 4,500 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాల్సి ఉంది. అయితే మండలంలో కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. రెండు నెలలుగా కౌలు కార్డుల పంపిణీ నిర్వహిస్తున్నా ఇప్పటికీ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇంకా 1,557 సీసీఆర్సీ కార్డులను కౌలు రైతులకు మంజూరు చేయాల్సి ఉంది. నిరంతరం సమావేశాలు నిర్వహించి త్వరితగతిన సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని మండలాధికారులు గ్రామ వీఆర్వోలను ఆదేశించినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సరైన అవగాహన లేక. కొందరు భూ యజమానులు అంగీకార పత్రం ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. అంగీకార పత్రం ఇస్తే భూమిపై హక్కు కోల్పోతామని, ప్రభుత్వం ద్వారా లభించే రాయితీలు అందవనే అపోహలు వారిని కలవర పెడుతున్నాయి. తద్వారా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

సీసీఆర్సీ కార్డులతో ప్రయోజనాలివీ..

పంట సాగు హక్కు కార్డులు పొందిన వారికి బ్యాంకు ద్వారా రుణాలు, పీఎం కిసాన్, అన్నదాన సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం అందుతుంది. విత్తనాలు, ఎరువులపై ప్రభుత్వ రాయితీ వర్తిస్తుంది. ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపరిహారం సైతం అందుతుంది. కరవు కాటకాలు వచ్చినా, పంట నష్టపోయినా సాయాన్ని అందుకోవడానికి అర్హత కలిగి ఉంటారు. కొత్త కార్డులతో పాటు గతంలో ఇచ్చిన కార్డులను వెంటనే రైతులు నవీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తులు విక్రయించుకోవచ్చు.

కౌలు రైతులు తప్పక పొందాలి



మండలంలోని కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత గ్రామాల రైతులు వీఆర్వోను సంప్రదించి దరఖాస్తు అందజేయాలి. గతంలో కౌలు కార్డు పొందిన వారు తక్షణమే రెన్యూవల్స్ చేసుకోవాలి. అవగాహన సదస్సుల ద్వారా భూ యజమానులను చైతన్యపరుస్తున్నాం.

–ఆర్.వెంకటేశ్వరరావు, ఏవో, పొన్నూరు

పేద విద్యార్థుల పాలిట పెన్నిధి సాయిరాం



విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్న ఎన్నారై ఏరువ సాయిరాం, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన తండ్రి పేరుతో స్కాలర్‌షిప్‌లను అందిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న ఎన్ఆర్ఐ సాయిరాం పేద విద్యార్థుల పాలిట పెన్నిధని తెలిపారు. అదేవిధంగా కళాశాల ఏర్పాటు చేసిన నాటి నుండి ప్రతి సంవత్సరం ఫెషర్స్ డే కార్యక్రమాలు అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ సహకారంతో నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని కలిగించే ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శ్రీచైతన్య కళాశాలల ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలల విద్యార్థులకు కూడా అవకాశం లేని కొన్ని కార్యక్రమాలు కమిటీ ఆధ్వర్యంలో చక్కగా ప్రతి సంవత్సరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ మెరిట్ విద్యార్థులకు శ్యామల రఘురామిరెడ్డి, దేవగిరి షణ్ముఖాంజనేయ రెడ్డిలు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి.

కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కమిటీ సభ్యులు దేవగిరి గంగాధరరెడ్డి, మున్నంగి సాంబిరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, లేళ్ల పెద అప్పిరెడ్డి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, కళాశాల ఇన్చార్జి రామచంద్రరావు, శాంతిప్రియ, నాగిరెడ్డి, చంద్రమౌళి, హనుమంతరావు, శ్రీనివాసరావు, శివపార్వతి , అరుణా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

- పెదకాకాని బీసీ హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ మాయం
- మినరల్‌వాటర్‌కు నోచుకోని విద్యార్థులు
- వర్షాకాలంలో 5 నెలలకు సరిపడా బియ్యం నిల్వలు
- బియ్యంలో పురుగులు



కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన నాసిరకం స్కూల్ బ్యాగ్‌లను పరిశీలిస్తున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

పెదకాకాని: విద్యార్థుల వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ ఎస్‌యు గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ అన్నారు. పొన్నూరు నియోజకవర్గం వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ సంక్షేమ వసతి గృహాల్లో భాగంగా బుధవారం పెదకాకాని మండలంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. మండల వైఎస్సార్ సీపీ ఎస్‌యు అధ్యక్షుడు కానుగోలు గోపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సమస్యలు విద్యార్థినులు నాయకుల దృష్టికి తెచ్చారు. రెండు సంవత్సరాలుగా హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో మినరల్ వాటర్‌కు నోచుకోలేదన్నారు. హాస్టల్ ముందు చెత్తా చెదారం వేయడం వల్ల దుర్వాసన రావడంతో పాటు హాస్టల్‌లోకి ఈగలు వస్తున్నాయన్నారు. హాస్టల్‌లో గత నెలలో దిగుమతి చేసిన బియ్యంలో పురుగు కనిపించగా కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకునేందుకు ఐదు నెలలకు సరిపడా బియ్యం నిల్వ చేయడాన్ని గుర్తించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ ఎస్‌యు అధ్యక్షుడు రేవంత్, బీసీ నాయకుడు పోతురాజు గోపి, పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన మల్లేశ్వర స్వామి ఆదాయం

- పెదకాకాని శివాలయంలో కానుకల హుండీలు లెక్కింపు పూర్తి
- 120 రోజులు హుండీ ఆదాయం 64,92,250 రూపాయలు



లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ డిప్యూటీ కమీషనర్ గోగినేని లీలాకుమార్

పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో బుధవారం హుండీలు తెరచి కానుకలు లెక్కించారు. దేవాదాయశాఖ వారి ఆదేశాల మేరకు ఈ హుండీల కానుకలు లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా గుంటూరు జిల్లా జేవీఓ, ఏసీ సైదమ్మబాయి హాజరయ్యారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటలకు ఆలయంలోని హుండీలు తెరచి కానుకలు ఆలయ కల్యాణమండపంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు.

సాయంత్రం 4 గంటల వరకూ జరిగిన లెక్కింపు కొనసాగింది. ఈ హుండీల ద్వారా 120 రోజులకు గాను కానుకల హుండీల ద్వారా 64, 92,250 రూపాయలు ఆదాయం లభించినట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. అలానే అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా 3,13,782 రూపాయలు సమకూరిందన్నారు.

హుండీల ద్వారా బంగారం 63.5 గ్రాములు, (63గ్రాముల 500మిల్లీ గ్రాములు), వెండి 795 గ్రాములు, విదేశి కరెన్సీ 623 అమెరికన్ డాలర్లు ఆదాయం సమకూరినట్లు డీసీ తెలియజేశారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కెనరా బ్యాంక్ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. పెదకాకాని పోలీసులు లెక్కింపు ప్రదేశములో బందోబస్తు పర్యవేక్షించారు.

ఐదు నామినేషన్లు దాఖలు

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు మొదటి రోజైన బుధవారం ఐదు నామినేషన్లు దాఖలు అయినట్లు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. నామినేషన్లలో వైస్ ప్రెసిడెంట్‌కి ఒక నామినేషన్, జాయింట్ సెక్రటరీకి 2 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు 2 నామినేషన్లు వచ్చాయని వివరించారు.

అందుబాటులోకి ఎమర్జెన్సీ మెడిసిన్ ట్రాలీలు

గుంటూరు మెడికల్: అత్యవసర చికిత్సల కోసం వచ్చే రోగులకు ఎమ్మారై, సీటీస్కాన్, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేయించేందుకు రోగిని ఆయా పరీక్షల గదుల వద్దకు తీసుకెళ్లేందుకు రోగుల సహాయకులకు చాలా ఇబ్బంది కలుగుతోంది. రోగుల సహాయకులతోపాటు, ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది కూడా వైద్య పరీక్షలు చేయించేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుంది. ఇక నుంచి ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా క్యాజువాల్టీలో అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులకు పడకపైనే అన్నిరకాల వైద్య పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం ప్రత్యేకంగా ఎమర్జెన్సీ ట్రాలీలను బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. రిసాసిడేషన్ స్ట్రక్చర్లు, మ్యాట్రిస్లు ఎమర్జెన్సీ రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా అత్యవసరంగా వచ్చే పేషెంట్లకు ఇంటిబేషన్, కార్డియాక్ మసాజ్, సీపీఆర్ మొదలకు వైద్య సదుపాయలు రోగిని ఎక్కడకు తరలించకుండానే స్ట్రక్చర్‌పైన చికిత్స చేసే వెసులుబాటు కల్పించారు. తద్వారా అత్యవసర విభాగంలోని రోగులకు మెరుగైన వైద్యాన్ని లభిస్తుంది. నూతన స్ట్రక్చర్లు ఎమర్జెన్సీ వార్డులో అందుబాటులోకి తీసుకొచ్చాని డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. తాను సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని బలోపేతం చేశామని వివరించారు.

సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల సందర్శన



రైతులకు వివరిస్తున్న డాక్టర్ షేక్ ఎన్ మీరా

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఐకార్ అటారి జోన్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామమైన జొన్నలగడ్డలో క్షేత్ర పరిశీలనలో భాగంగా సేంద్రీయ వ్యవసాయం వరి పొలాన్ని సందర్శించటం జరిగిందన్నారు. సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్న రైతులందరిని ఒక ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌గా ఏర్పాటు చేసి వారందరికీ సర్టిఫికేషన్ నిర్వహించి, మార్కెటింగ్ కెవికె ద్వారా కల్పిస్తామని తెలిపారు. వెదపద్ధతి వరిలో విత్తనం విత్తే విధానంపై ద్రవ జీవామృతం తయారీపై క్షేత్ర ప్రదర్శన, అవగాహన కల్పించారు. ఆదర్శ అపరాల గ్రామంలో మినుములో నూతన వంగడాలను 375 మంది రైతులకు అందించి విత్తన ఉత్పత్తిదారులుగా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె హెడ్ డాక్టర్ ఎం యుగంధర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి, ఆదర్శ రైతులు వంగా నవీన్‌రెడ్డి, జొన్నల శ్రీనివాస్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: కరోనా సమయంలో ఆర్థిక భారంతో పేరుతో నిలిపివేసిన సీనియర్ సిటిజన్స్ రాయితీలను రైల్వే శాఖ పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా 2020లో కేంద్ర తాత్కాలికంగా నిలిపి వేసిన రైల్వే రాయితీలను కరోనా తగ్గు ముఖం పట్టి ఏళ్లు గడుస్తున్నా ఆ రాయితీలను పునరుద్ధరించక పోగా శాశ్వతంగా రద్దు చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి పి.భావన్నారాయణ మాట్లాడుతూ బ్రిటన్, కెనడా, జర్మనీ, జపాన్ దేశాలు వృద్ధుల ప్రయాణ అవసరాలను గుర్తించి ప్రత్యేక రాయితీలను కొనసాగిస్తున్నారని చెప్పారు. కేంద్రం ఇప్పటికైనా స్పందించి రాయితీలను పునరుద్ధరించాలన్నారు.

వ్యర్థాలు తగలబెట్ట వద్దు

విలీన గ్రామాల్లో కమీషనర్ పర్యటన



మాట్లాడుతున్న కమీషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి వ్యర్థాలను దహనం చేయడం వల్ల వాహనదారులకు, పర్యావరణానికి సమస్యగా ఉంటుందని, స్థానిక పంచాయితీల అధికారులు, జీఎంసీ ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు, వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంబడి వ్యర్థాలు గుట్టలుగా వేసి, దహనం చేయడం తీవ్ర సమస్యగా ఉందని, వ్యర్థాలు వేసే వారిని ప్రత్యేక నిఘా పెట్టి అడ్డుకోవాలన్నారు. అవసరమైతే అపరాధ రుసుం విధించాలని పంచాయితీ, జీఎంసీ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. నగరంలోని డివిజన్ల వారీగా చెత్త తరలింపు కోసం వాహనాలు కేటాయించామని, శివారు ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉంటే సంబంధిత ఇన్‌స్పెక్టర్‌దే బాధ్యత వహించాలని హెచ్చరించారు. అనంతరం వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ ఎంపీడీఓ కె శ్రీనివాసరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వర శాస్త్రి, జీఎంసీ డీఈఈ వెంకటరమణ, టిడ్కో డీఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సొసైటీ సెక్రెటరీలకు శిక్షణ



క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సొసైటీ సెక్రెటరీలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రైమరీ కోఆపరేటివ్ సొసైటీ సెక్రటరీలకు శిక్షణ తరగతులను గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యక్రమంలో భాగంగా శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం వెంకటరాములు మాట్లాడుతూ సొసైటీ సెక్రటరీలకు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందించి వారి ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నందివెలుగు గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించారు. రైతు సంఘం డైరెక్టర్ మీసాల రామకృష్ణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సంఘం సభ్యులు పండించే పంటలను, యాజమాన్య విధానాలు వివరించారు. సంఘం ద్వారా 15 రకాల పంట ఉత్పత్తులను విక్రయించటం జరుగుతుందని తెలిపారు. అనంతరం అత్తోట గ్రామంలో రోశయ్య సేంద్రియ, మల్టి స్టోరేజ్ బహుళ అంచెల పంట విధానాలను, రైతు బాబురావు భూమిభారతిని సందర్శించారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఉత్పత్తులను సందర్శించారు. సోలార్ ఆధారిత కోల్డ్ స్టోరేజ్ తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం అధికారి రాజవంశీ, రైతులు తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



సుబ్బారావుకు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

చినలింగాయపాలెం (కాకుమాను): మండలంలోని చినలింగాయపాలెంకు టీడీపీ సీనియర్ నాయకుడు మదమంచి సుబ్బారావు తన కుటుంబ సభ్యులతో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొమ్మాలపాటి రవి కుమార్ సుబ్బారావుకు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల నుంచి అన్యాయంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయాలు, అక్రమాలను జీర్ణించుకోలేక పార్టీను వీడినట్లు ఆయన తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీ తగిన బుద్ధిచెప్పి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, పార్టీ సీనియర్ నాయకుడు నన్నపనేని కిషోర్ బాబు, ఎంపీటీసీ జూపూడి ఏసేబు, మహేంద్ర ఫణి, పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

కౌలు రైతులకు పంట బీమా వర్తింపచేయాలి



పొలాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

పొన్నూరు: కౌలు రైతులు పంట రుణాలు పొందితే పంట బీమా వర్తింప చేయాలని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ తెలిపారు. బుధవారం మండలంలోని వల్లభరావుపాలెం, నండూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి. రామకోటేశ్వరి పాల్గొని రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. వైభవ్ శర్మ మాట్లాడుతూ రైతుకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూరే విధంగా బీమా వర్తింపచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్. తిరుమలాదేవి, ఏవో ఆర్. వెంకటేశ్వరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఐ. శ్రీకాంత్, డి. యామిని, గ్రామ వ్యవసాయ సహాయకులు గుడారు వెంకయ్య, టి. ప్రసాద్, పి. దుర్గమ్మ బి. ప్రీతి, ఇన్సూరెన్స్ సిబ్బంది ఎంపీఈవో షేక్. రేష్మ, ఎస్. సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులు అందించాలి

కౌలు రైతులకు వెంటనే సీసీఆర్సీ కార్డులు అందజేయాలని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ ఆదేశించారు. బుధవారకం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 4,500 సీసీఆర్సీ కార్డులు కౌలు రైతులకు మంజూరు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,943 మాత్రమే మంజూరు చేశారని వెంటనే అందరికీ అందించేలా విధులు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్చిన లక్ష్యాలను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, ఆర్ఐ. శ్రీనివాస్, ఏవో వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శాటిలైట్ ప్రయోగం అద్భుతం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ అంతరిక్ష, భౌగోళిక పరిశోధనల్లో అద్భుత విజయాలకు నిసార్ శాటిలైట్ ప్రయోగం నాందిగా మారనుందని ప్రముఖ ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్, ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో కోపల్లి జయకర్ బాబు మోడరేటర్‌గా 'అంతరాలు తొలగించు అంతరిక్షం' బ్యానర్‌పై ఏ గేమ్ చేంజర్ శాటిలైట్- నిసార్ అనే అంశంపై బుధవారం జూమ్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్పేస్ కిడ్స్ ఇండియా సీఈఓ కె.శాని, భౌతికశాస్త్ర అధ్యాపకుడు వారణాసి దుర్గాప్రసాద్, కిడ్స్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కేశాని పాల్గొన్నారు.